

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

### (ప్రారంభం)

*నువ్వు ఉత్తర ధృవాన విరిసిన అరోరా బొరియాలిస్‌వి*

*నేను దక్షిణ ధృవ తీరాన నిలిచిన పెలికన్ పక్షిని*

*- తిలక్*

**1990 ఆగస్టు – హైదరాబాదు**

"చల్లగా వుంది కానీ, అన్-కంఫర్టబుల్ గా లేదు," తనకి తనే సర్ది చెప్పుకుంటూ నడుస్తున్నాడు అశోక్. మిగిలిన వెల్తుర్ని ఎలాగూ తను మింగబోతుందన్న ధీమాతో చీకటి అంతటా పరుచుకుంటోంది.. ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న ఒకటీ అరా నక్షత్రాలు పార్టీకి ముందే వచ్చేసిన అతిధుల్లా మొహమాటంగా వెలుగుతున్నాయి.

కళ్ళజోడు తుడుచుకుంటూ నడుస్తున్న అశోక్ కింద పడ్డ దాకా తన తనకెదురుగా వస్తూ వున్న సైకిల్‌ని చూడనే లేదు.

"వెరీ సారీ! నేనే చూసుకోకుండా చాలా ఫాస్టు గా వచ్చేసాను. దెబ్బలు తగిలాయా?" కోమల కంఠం తాలూకు నాజూకైన చేయి అందిస్తున్న అమ్మాయిని పరీక్షగా చూసాడు.

పదిహేడు పద్దెనిమిదేళ్ళుండొచ్చు. మోకాళ్ళ దాకా వున్న స్పోర్ట్స్ షార్టూ, నిమ్మకాయ రంగు టీ-షర్టూ, చిన్న పోనీటైల్ తో చాలా సింపుల్ గా వుంది కానీ చాలా చురుగ్గా వుంది. తను తొందరగా లేవకపోవటం గమనించి అప్పుడే అసహనం మొదలైందామెలో. "*ఇంకా ఎంత సేపలాగే పడి వుంటావు, లే!*" అన్న భావన ఆమె కళ్ళలో రూపు దిద్దుకుంటుంది. ఆమె చేయందుకుని చటుక్కున లేచి నిలబడ్డాడు అశోక్.

"ఎక్కడైనా దెబ్బలు తగిలాయా చూసుకొండి!" అంటున్న ఆమె మాటలు విని మోచేతులు చూసుకున్నాడు. ఎడమ మోచేయి కొంచెం చెక్కుకు పోయి రక్తం వస్తుంది.

"ఓ గాడ్! గాయమైనట్టుంది. ఇక్కడే మా ఇల్లు. పదండి. చిన్న బాండ్ అయిడ్ వేస్తాను, లేకపోతే మళ్ళీ ఏదైనా ఇన్‌ఫెక్షన్ సోకవచ్చు!" తన జవాబు కోసం ఎదురు చూడకుండా సైకిల్ నడిపించుకుంటూ నడవటం మొదలు పెట్టింది.

"నో నో! ఇటు చూడండి, మిస్!"

ఆగకుండా నడుస్తూ వెనక్కి తిరగకుండానే జవాబిచ్చింది ఆమె,

"భాను!"

"భాను గారూ, అయాం ఆల్రైట్. "

అతని మాటలేవీ వినిపించుకోనట్టు ఎదురుగా వున్న గేటు తెరిచి సైకిల్ తో సహా లోపలికెళ్ళి గేటు తెరిచి పట్టుకుంది. ఇక బాగుండదని తనూ లోపలికి నడిచాడు. ఏమీ మాట్లాడకుండా గేటు వేసి లోపలికెళ్ళి కాలింగ్ బెల్ నొక్కింది.

కొద్దిసేపటికి భాను తల్లికాబోలు తలుపు తెరిచింది.

"ఆట అయిపోయిందా? బాడ్మింటన్ రాకెట్టేదీ? ఈ అబ్బాయెవరూ?"

"అబ్బబ్బ! అమ్మా, అసలు లోపలికి రానిస్తావా? బాడ్మింటన్ రాకెట్టు సైకిల్‌కి తగిలించే వుంది. ఈ అబ్బాయిని దార్లో నేను సైకిల్‌తో గుద్ది కింద పడేసాను. చేతికి కొంచెం దెబ్బ తగిలినట్టుంది, మందేద్దామని తీసుకొచ్చా. అంతే! మీరు కూర్చొండి!" అశోక్ తో చెప్పి, లోపలికెళ్ళింది భాను.

సిగ్గూ,మొహమాటాలతో మొహమంతా ఎర్రబడి అలాగే నిలబడ్డాడు అశోక్.

"నువ్వు కూర్చో బాబూ, ఇప్పుడే వస్తా," అంటూ లోపలికెళ్ళింది ఆవిడ. కాస్త నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంటూ సోఫాలో కూర్చున్నాడు అశౌక్.

అయిదు నిమిషాలు ఇబ్బందిగా గడిచాయి. ఈసారి లోపల్నించి ముగ్గురొచ్చారు.

అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు అశౌక్.

"హలో! అయాం పద్మనాభం. మా పిల్ల మిమ్మల్ని చూసుకోకుండా కింద పడేసినట్టుంది. దానికంతా తొందరే!" అశోక్ కి కుర్చీలో కూర్చోమని సైగ చేస్తూ అన్నాడు భాను తండ్రి.

అశోక్ కూర్చోగానే అతని పక్కనే కూర్చొని ఫర్స్ట్ ఎయిడ్ డబ్బా తెరిచి డెటాల్లో ముంచిన దూది ముక్కతో మెల్లగా గాయాన్ని శుభ్రం చేయ సాగింది భాను.

" ఆవిడ మా అమ్మ. ఆవిడ పేరు ప్రభావతి." అని తండ్రి వైపు తిరిగి,

"మిమ్మల్ని ఇంట్రొడ్యూస్ చేసుకున్న తరువాత అమ్మని పరిచయం చేయరెందుకూ ఎప్పుడూ?" అంది.

"సో సారీ! అన్నట్టు నీ పేరేమిటోయ్?" అన్నాడాయన నవ్వుతూ.

"అశోక్! ఇక్కడే డిగ్రీ కాలేజీలో బియ్యే ఫైనలియర్ చదువుతున్నాను."

"బియ్యే?" ఆయన గొంతులో ఆశ్చర్యం! ఇంకా ఈ రోజుల్లో బియ్యే చదివే విద్యార్థులున్నారా అన్నట్టు. దాన్ని పట్టించుకోలేదు అశోక్. ప్రభావతి వుండబట్టలేక అడగనే అడిగింది,

"బియ్యే ఎందుకబ్బాయ్? ఇంజినీరింగులో సీటు దొరకలేదా?"

జవాబివ్వడం ఇష్టం లేనట్టు నవ్వేసాడు అశోక్. దీని వెనకాల ఏదో పెద్ద విషాద గాథ వుంది, అది తను తప్పక కనిపెట్టేయాలన్న ఆతృత మొదలైంది ప్రభావతిలో.

"ఎక్కడుంటారు మీరు? మీ నాన్నగారేం చేస్తూ వుంటారు?"

లేచి నిలబడ్డాడు అశోక్.

"మళ్ళీ కలుస్తానండీ! నాకు ఆలస్యం అవుతోంది. బై భానూ." వాళ్ళు తేరుకునేలోగానే గేటు తీసి వెళ్ళిపోయాడు. అమ్మా నాన్నల మొహాలు చూసి విరగబడి నవ్వింది భాను.

మర్నాడు కాలేజీ కెళ్ళినా అశోక్ గుర్తొస్తూనే వున్నాడు ఆమెకి. ఇక్కడే డిగ్రీ కాలేజీ అన్నాడే కానీ, యే కాలేజీనో చెప్పనేలేదు. అమ్మలా బయట పడలేదు కానీ, తనకీ కుతూహలంగానే వుంది అతను బియ్యే ఎందుకు చదువుతున్నాడో అని. చూడడానికి తెలివైన వాడిలానే వున్నాడు. కళ్ళద్దాలూ, సౌమ్యంగా మొహం, మాటా మర్యాదా, అంతా మధ్య తరగతిలావున్నాయి. మరి మధ్య తరగతి అమ్మా-నాన్నలు ఇంజినీరింగూ మెడిసినూ కాకుండా పిల్లల్ని ఇంకేదీ చదివించరుగా? ఏమిటో అంతా మిస్టరీలాగుంది. ఇంతలో స్నేహితులు కలవడంతో రోజు వారీ రొటీన్ లో పడిపోయింది.

ఆ పై ఆదివారం చిరు చీకట్లు కమ్ముకునే వేళ సైకిలు తీసుకొని పార్కు చుట్టు పక్కలే తారట్లాడింది కూడా. ఎక్కడైనా కనిపించకపోతాడా అని. రెండు వారాల్లో అతను కనిపించకపోవడంతో, అతనిక కనిపించడేమో అనుకుంటున్న సమయంలో మళ్ళీ అతన్ని యూనివర్సిటీ లైబ్రరీలో చూసి ఆనందంతో భాను కళ్ళు మెరిసాయి.

లేత నీలం రంగు షర్టు జీన్సులోకి టక్ చేసి, కుర్చీలో కూర్చుని ఏదో లావుపాటి పుస్తకంలోకి దీక్షగా చూస్తున్నాడు.

"నేను కాసేపు లైబ్రరీలో కూర్చొని తర్వాత వెళ్తాను, మీరు వెళ్ళండి" అని తనతో వున్న స్నేహితులందరికీ చెప్పి టేబిల్ దగ్గరకి నడిచింది భాను.

"హలో!" గుసగుసగా అంది పక్కన నిలబడి. ఉలిక్కిపడి తలెత్తి ఒక్క క్షణం అయోమయంగా చూసాడు. అంతలోనే తేరుకుని నవ్వుతూ,

"హలో భానూ! మీరేమిటి ఇక్కడ?"

"నేను ఇక్కడే ఇంజినీరింగ్ కాలేజీలో బి. టెక్ రెండో సంవత్సరం చదువుతున్నా! మీరు?"

"నేను బయట డిగ్రీ కాలేజీ. ఇక్కడ లైబ్రరీలో పుస్తకాల కోసం వచ్చాను."

"బయటికెళ్ళి కాఫీ తాగుదామా? ఇక్కడ గుసగుసల్లో మాట్లాడడం కష్టంగా వుంది!"

నవ్వాడు అశోక్.

" పదండి!"

కేంటీన్ లో కెళ్ళి కాఫీ తెచ్చుకుని కూర్చున్నారిద్దరూ.

"ఇప్పుడు చెప్పండి! ఆ రోజు మీకు మా అమ్మా నాన్నల మీద బాగా కోపం వచ్చినట్టుంది!"

ఇబ్బందిగా నవ్వాడు అశోక్.

"ఎబ్బెబ్బే! అదేం లేదు. నిజంగానే పనుండి వెళ్ళిపోయాను."

"ఆ విషయం నిజమే అయితే పై ఆదివారం మా ఇంటికి రావాలి మరి. అమ్మా నాన్న చాలా బాధ పడ్డారు మిమ్మల్ని ఇరిటేట్ చేసామేమో అని!"

"నో, నో, నాటెటాల్. తప్పక వస్తా. ఇంజినీరింగ్ లో మీదే బ్రాంచీ?"

"కెమికల్ ఇంజినీరింగ్. మీరెందుకు బియ్యే చదువుతున్నారు?" ఈసారి ఆమె కంఠంలో ఆత్రం దాగలేదు. మళ్ళీ నవ్వాడు అశోక్.

"ఎందుకంటే, నాకదే ఇష్టం కాబట్టి."

" మరి ఉద్యోగాలు..."

"ఏదో ఒకటి దొరక్కపోదు!"

"మీ ఇంట్లో ఏమనలేదా?" అమాయకంగా అడిగింది.

" వొద్దన్నారు, కానీ నేనెలాగో నచ్చచెప్పుకున్నా. మీ నాన్నగారేం చేస్తూ వుంటారు?"

"నాన్నగారు రైల్వేలో ఇంజినీరు. అమ్మ కార్పొరేట్ హాస్పిటల్ లో న్యూట్రిషనిస్టు. మీకు బియ్యేలో ఏం సబ్జెక్టు వుంటాయి?"

"నేను జర్నలిజమూ, ఇంగ్లీషూ, మాస్ కమ్యూనికేషనూ తీసుకున్నాను."

ఆమె వంకే పరిశీలనగా చూస్తూ అన్నాడు. సన్నగా, చిన్నగా, తెలివైన మొహంతో అమాయకంగా వుంది. కొంచెం అమాయకత్వం వున్నా, కొంచెం అల్లరీ ఆగకుండా తోసుకొని వచ్చే చిరునవ్వూ బావున్నాయి.

"డిగ్రీ యే కాలేజీలో చదువుతున్నారు?" కుతూహలంగా అడిగింది.

"నిజాం కాలేజీ."

"సరే, శనివారం మా ఇంటికొస్తున్నారుగా?"

"శనివారం కొంచెం బిజీ భానూ!"

"అయితే, ఆదివారం. సాయంత్రం అయిదింటికల్లా వొచ్చేయండి."

"మీ ఇంట్లో ఏమనుకుంటారో!" మొహమాటంగా అన్నాడు అశోక్.

"ఇందులో అనుకోవడానికేముంది?"కొట్టి పారేసింది. పుస్తకాల సంచీలోంచి ఒక నోటు పుస్తకం లోంచి ఒక చిన్న పేపరు మీద టెలిఫోన్ నంబరూ, ఇంటి అడ్రసూ రాసి ఇచ్చింది.

"మా ఇల్లు గుర్తుందో లేదో అని ఇందులో అడ్రసు రాసాను. మా ఫోన్ నెంబరు కూడా వుంది. ఆదివారం నేను ఎదురు చూస్తూ వుంటా! లెటజ్ గో" లేచి నిలబడింది. కాఫీకి డబ్బు చెల్లించి ఇద్దరూ బయటికి నడిచారు. బస్సు స్టాపు దగ్గరికొచ్చారు.

"మీ ఇల్లెక్కడ? ఏ బస్సెక్కాలి?"

"మలక్‌పేట. కోఠీకి వెళ్ళి అక్కణ్ణించి వెళ్తాను."

"నేను ఆటోలో వెళ్ళిపోతాను. సీ యూ లేటర్!" బై చెప్పి వెళ్ళిపోయింది భాను.

"నాన్నా! మొన్న నా సైకిలు కింద పడి దెబ్బ తాకిచ్చుకున్నాడే, అశోక్, అతను ఇవాళ లైబ్రరీలో కనపడ్డాడు." రాత్రి భోజనాల దగ్గర చెప్పింది భాను.

"అవునా? ఆ అబ్బాయి బియ్యే చదువుతున్నాడు కదూ? ఈ రోజుల్లో బియ్యే చదివే వాళ్ళూ వున్నారా? ఆడపిల్లలు కూడా చదవట్లేదు బియ్యే!" ప్రభావతి అంది.

"యేం? బియ్యే ఏమైనా తక్కువా? ఇంగ్లీషు లిటరేచరూ, జర్నలిజమూ అట అతని సబ్జెక్ట్స్! హౌ ఇంటెరెస్టింగ్!" అంది భాను.

"యేమోలే! బోడి బియ్యేలకేం ఉద్యోగాలొస్తాయి? యే అయ్యేయస్సో చేస్తే, చెప్పలేం కానీ!"

"అతన్ని మన ఇంటికి టీకి రమ్మని పిల్చాను. ఆదివారం అయిదింటికి. ఈ సారి అతనితో సరిగ్గా మాట్లాడండి! " తల్లితో నవ్వుతూ అన్నది భాను.

"ఎందుకు భానూ? అనవసరమైన పరిచయాలు?" చిరాగ్గా అన్నాడు పద్మనాభం.

"ఎందుకు నాన్నా? పిలిస్తే ఏంటి? ఆ రోజు మనం చాలా అమర్యాదగా మాట్లాడామనిపించింది నాకు, అందుకే రమ్మన్నాను. "

ఇంతకుముందు ఎన్నిసార్లు స్నేహితులని పిలిచినా అమ్మా నాన్నా ఎప్పుడూ వొద్దనలేదు. ఆశ్చర్యపోయింది భాను. పిలిచి తప్పు చేసిందా? ఆమెకి కొంచెం బెంగగా అనిపించింది.

ఆదివారం పేపరు చదువుతూ ఆలోచిస్తున్నాడు అశోక్. ఇవాళ అయిదింటికి భాను వాళ్ళ ఇంటికెళ్ళాలి. వెళ్ళాలంటే మొహమాటంగా వుంది. కానీ వెళ్ళాలనీ వుంది. భానుతో మాట్లాడాలనీ, పరిచయం పెంచుకోవాలనీ వుంది, కానీ వెళ్తే బాగుండదేమో!

అయిదింటికి సరిగ్గా కాలింగ్ బెల్ మోగింది.

"హలో ఆంటీ! గుడ్ ఈవ్నింగ్. బాగున్నారా?" తలుపు తెరిచిన ప్రభావతిని పలకరించాడు అశోక్.

"హలో అశోక్! రా లోపలికి".

హాల్లో టెలిఫోన్‌లో మాట్లాడుతూ వున్న భాను లేచింది. ఎప్పట్లాగే మొహమాటంగా ఆమె వైపు చూసి నవ్వాడు అశోక్.

"కూర్చో అశోక్. అవునూ, నీ చేతి గాయం మాని పోయిందా?"

"ఆ, వారం రోజుల్లోనే తగ్గిపోయింది."

లోపల్నుంచి పద్మనాభం కూడా వొచ్చి కూర్చున్నాడు. భానూ, ప్రభావతీ వంటింట్లోంచి పకోడీల ప్లేట్లూ, టీ పట్టుకొచ్చారు. చచ్చేంత మొహమాటంగా వుంది అశోక్ కి. ఎలాగో రెండు పకోడీలు తిని టీ తాగాడు.

"పకోడీలూ, టీ చాలా బాగున్నాయి ఆంటీ. అన్నట్టు, దిసీజ్ ఫర్ యూ!" అంటూ ఒక చిన్న చాక్లెట్ బాక్స్ ప్రభావతి చేతికిచ్చాడు. నవ్వి, వాటినందుకొని తలా ఒక చాక్లెటిచ్చింది ప్రభావతి.

"మీ ఇల్లెక్కడోయ్ అశోక్? నువ్వూ నిజాం కాలేజీ అట కదా? మా నాన్నగారూ నిజాం కాలేజీలోనే చదువుకున్నారు. చాలా మంచి కాలేజీ అట కదా. హైదరాబాదులో చాలామంది ప్రముఖులు నిజాం కాలేజీలో చదువుకున్నారు, శ్యాం బెనెగల్, అజరుద్దీన్ లాటి వాళ్ళు. మీకు టీచింగదీ బాగుంటుందా?" పద్మనాభం అడిగాడు.

"బానే వుంటుందండీ. అయితే లిటరేచర్ లాటి సబ్జెక్టు లెక్చరర్ చెప్పేది కొంత వరకే. మన అభిరుచీ, పఠనమూ కూడా చాలా ముఖ్యం."

"మీ నాన్నగారేం చేస్తూ వుంటారు అశోక్?" ప్రభావతి అడిగింది.

"నాన్నగారు లేరండీ. అయిదేళ్ళ క్రితం ఏక్సిడెంటులో పోయారు. స్టేట్ గవర్నమెంటులో పని చేసేవారు. అమ్మ డిగ్రీ కాలేజీలో లెక్చరరు. ఒక చెల్లి అమూల్య, పదో తరగతి చదువుతోంది."

ఇంకా రాబోయే ప్రశ్నలకి కూడా సమాధానమిచ్చేసాడు అశోక్.

“ఓ! అయాం సారీ!” టాపిక్ మార్చేసాడు పద్మనాభం. ఆ తరవాత కబుర్లతో రెండు గంటల కాలం ఎలా గడిచిపోయిందో తెలియనే లేదు. సాహిత్యమూ, రాజకీయాలూ, పుస్తకాలూ, సినిమాలు, వాళ్ళ సంభాషణలో అన్ని విషయాలూ దొర్లి పోయాయి.

"వస్తానండీ! థాంక్స్ ఫర్ ది టీ భానూ!" అంటూ లేచి నిల్చున్నాడు అశోక్.

వాళ్ళ దగ్గర నుంచి వీడ్కోలు తీసుకున్నాడు.

"అబ్బాయి భలే తెలివైన వాడిలావున్నాడు. మనవాళ్ళేనో కాదో!" భాను చదువుకోవడానికి లోపలికెళ్ళాక మెల్లిగా పద్మనాభంతో అన్నది ప్రభావతి.

"డోంట్ బి సిల్లీ! దానికింకా పంతొమ్మిదేళ్ళే. నువ్వు పిచ్చి మాటలు మాట్లాడి చదువుకుంటున్న పిల్ల మనస్సు చెడగొట్టకు," చదువుతున్న పేపర్ పక్కన పెట్టి అన్నాడు పద్మనాభం.

"అయ్యో రామా! నేనిప్పుడేమన్నాను? ఏదో ఒక మాట అనుకోవడం కూడా తప్పే ఈ ఇంట్లో!" తనూ పుస్తకం పట్టుకొని లోపలికెళ్ళిపోయింది ప్రభావతి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS